## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రచారాన్ని ప్రారంభించిన రూమ్ టు రీడ్ ప్రతినిధులు

వెంగళరావునగర్, అక్టోబర్ 13: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సమాచారం శరవేగంగా ఎల్లలు దాటుతుంది. ముఖ్యంగా స్మార్ట్ ఫోన్లతో అర చేతిలో ప్రపంచం ప్రత్యక్షమవుతుంది. అయితే అర చేతిలో ప్రపంచం పై అప్రమత్తత అవసరమని రూమ్ టు రీడ్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం రూమ్ టు రీడ్ ఆనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికల విద్య కార్యక్రమంలో భాగంగా జవహర్ నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద 'సైబర్ భద్రత–నా డిజిటల్ ప్రపంచం' అనే అంశం పై వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమానికి విస్తృతంగా ఆటో క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. కంప్యూటర్ తో ప్రపంచం కుగ్రామంగా మారిందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బాలికల అక్షరాస్యత పెరుగుతుందని..బాలికలు సైబర్ మోసాలకు గురవకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రూమ్ టు రీడ్ బాలిక ఎడ్యూకేషన్ ఆఫీసర్ సరిత, సీనియర్ సోషల్ మొబలైజర్ రాధిక, మమత, స్వప్న, మంజరి తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబురాలు



చిన్నారుల బతుకమ్మ సంబురాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధురానగర్ లోని శ్రీనిధి స్వీట్ ఏంజిల్స్ క్యాంపస్ పాఠశాలలో చిన్నారులకు బతుకమ్మ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ కొల్లి లక్ష్మణ రావు బతుకమ్మ ఉత్సవాల విశిష్టతను తెలియజేశారు. శ్రీనిధి పాఠశాలలకు చెందిన డైరెక్టర్లు సుకుమార్, కృష్ణవేణి, లక్ష్మణ్, ప్రిన్సిపాల్ గీత, వైస్ ప్రిన్సిపాల్స్ విమల,రాజేశ్వరితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. –వెంగళరావునగర్, అక్టోబర్ 13 :

## వ్యాపారులను ఇబ్బందులు పెట్టొద్దు

బేగంపేట్ అక్టోబర్ 13: ఎన్నికల నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంలో తప్పులేదు కానీ..నిబంధనల పేరుతో వివిధ వర్గాలకు చెందిన వ్యాపారులను ఇబ్బంది పెట్టడం తగదన్నారు. నగరానికి చెందిన స్వర్ణకారులే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి స్థిరపడి బంగారం, వెండి అభరణాల వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారి పట్ల నిబంధనల వంకతో అధికారులు నిర్వహిస్తున్న తీరుతో వ్యాపారులు ఎంతో ఆందోళన, ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు.




# ఓటరుగా నమోదు చేసుకోవాలి



యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న యూసీడీ పీవో హిమబిందు

జూబ్లీహిల్స్,అక్టోబర్13: పద్దెనిమిదేండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని యూసుఫ్‌గూడ సర్కిల్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారి హిమబిందు సూచించారు. అర్హులందరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 'స్వీప్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో 100 శాతం ఓటింగ్ సరళిని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులతో ఓటర్లను చైతన్య పరిచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యార్థులకు స్కిట్ పోటీలు నిర్వహించి స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వస్తున్నామన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పార్కులు, జనాలు ఉన్న ప్రాంతాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన

జూబ్లీహిల్స్,అక్టోబర్13: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎన్నికల అధికారులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్ల పరిశీలన చేపడుతున్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డీఎంసీ సేవా ఇస్లావత్‌తో కలిసి పోలింగ్ స్టేషన్‌లు పరిశీలించారు. ఆయా పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక వసతులతో పాటు వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేశారా అన్న అంశాలను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ రాజ్‌కుమార్, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, ఏఈ అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్వో రవి, ఎలక్టోరల్ ఆఫీసర్, డీఎంసీ సేవా ఇస్లావత్

## ఐదేండ్లలోపు చిన్నారులకు టీకాలు వేయించాలి



చిన్నారులకు టీకాలు వేసేందుకు సర్వే చేపడుతున్న ఏఎన్ఎం నాగవేణి, ఆశా వర్కర్ రాజమణి

జూబ్లీహిల్స్,అక్టోబర్13: మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా ఐదేండ్లలోపు పిల్లలందరికీ టీకాలు వేసేందుకు వైద్యారోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు ఐఎంఐ మెగా టీకా కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లో ఏఎన్ఎం నాగవేణి, ఆశా వర్కర్ రాజమణితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి వారికి టీకాలను వేస్తున్నారు. శ్రీరాంనగర్ క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎంల ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌లు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. టీకాలు వేయించుకోకుండా మిగిలిపోయిన 0–5 ఏండ్లలోపు చిన్నారులను.. నగరానికి పనుల కోసం వలస వచ్చే కుటుంబాలలో ఇప్పటికి టీకాలు వేయించకుండా ఉన్న పిల్లలను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. ఐదేండ్లలోపు పిల్లల్లో ఒక్కరికి కూడా మిస్ కాకుండా టీకాలు వేస్తున్నామని వైద్య సిబ్బంది తెలిపారు.

## జెక్‌కాలనీలో బతుకమ్మ సంబురాలకు ఏర్పాట్లు

అమీర్‌పేట్, అక్టోబర్ 13 : బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జెక్‌కాలనీ మహిళలు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జెక్‌కాలనీ రెసిడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న కాలనీలో వందలాది మహిళల భాగస్వామ్యంతో జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. ఇందుకు సంబంధించిన వివరాలను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్.అన్నపూర్ణ (దేవాదాయ శాఖ సహాయ కమిషనర్)లు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలను తొలి రోజున జెక్‌కాలనీ స్ట్రీట్‌నెంబర్ 2లోని అనంతరెడ్డి బంగ్లా ఆవరణలో ప్రారంభమవుతాయని, ఆ తరువాత ప్రతి రోజు ఒక్కో స్ట్రీట్‌లో ఈ వేడుకల నిర్వహణకు ఆయా అపార్ట్‌మెంట్స్ నివాసితులతో కలిసి సన్నాహాలు పూర్తి చేశామన్నారు. వేడుకల చివరి రోజు 22న సాయంత్రం 6 గంటల నుంచి కాలనీలోని బతుకమ్మ చౌరస్తాలో (హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో) సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆ రోజు సంప్రదాయ బతుకమ్మను అత్యుత్తమంగా తీర్చిదిద్దిన మొదటి అయిదు మందికి పట్టుచీరలను అందజేయడం జరుగుతుందని, దీంతో పాటు బతుకమ్మను తీసుకువచ్చిన ప్రతి మహిళకు కూడా ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. నగరంలోని ప్రముఖ దేవాలయాలైన ఉజ్జయినీ మహంకాళి, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయాలకు సుదీర్ఘకాలం పాటు ఈవోగా పని చేయడమే కాకుండా ఆయా దేవాలయాల ఆవరణలో జరిగే బతుకమ్మ వేడుకలను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసిన కాలనీకి చెందిన (దేవాదాయ సహాయ కమిషనర్) అన్నపూర్ణ సలహాలు సూచనలతో ఈ వేడుకలను గతంలో కంటే ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశామని బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు ప్రభ వెల్లడించారు.

## ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

జూబ్లీహిల్స్,అక్టోబర్13: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండటంతో జీహెచ్ఎంసీ సిబ్బంది వివిధ రాజకీయ పార్టీల పోస్టర్ల తొలగింపు పనులు ముమ్మరం చేశారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ ఆదేశాల మేరకు సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో వెలసిన వివిధ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, జెండాలతో పాటు గోడలపై రాతలను తొలగిస్తున్నారు. అనుమతి లేకుండా ఎలాంటి పోస్టర్లు, ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేయవద్దని ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలుంటాయని వెల్లడించారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక సమ్మేళనం

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 13 : పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాలలో శుక్రవారం 'పరస్పర' పేరుతో సంప్రదాయ, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అమర్నాథ్ శర్మలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. భారతీయ జీవన విధానాలు, సంప్రదాయాలు ఎంతో గొప్పవని అన్నారు. తెలంగాణ సంస్కృతి, పండుగలు, పర్వదినాలు వాటి ఔన్నత్యం గురించి విద్యార్థులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఫ్యాషన్ షో స్వయంగా తయారుచేసిన పిండి వంటకాల ప్రదర్శన ఆటపాటలతో రోజంతా సందడిగా సాగింది.